

## శోభనం చీర !

ఆడదానికి పెళ్ళిరోజున, మగవాడికి శోభనం రోజున గుండెదడగా వుంటుంది. కాని పాపం కామేశ్వరికి కార్యం రోజున కూడా గుండెదడగానే వుంది. కారణం బామ్మ ఇచ్చిన శోభనం చీరే!

ఆ చీర కట్టుకుంటే చాలు, బావ కళ్ళకి జన్మజన్మాలకి అప్సరసలాగా కనబడతానట! అప్సరసలంటే ఏదో భోగం వాళ్ళనుకుంటారు కానీ, అలా కాదుట, వాళ్ళు వరాలు ఇస్తారట, శాపాలు పెట్టగలరట, ఎన్నో తపస్సులు చేసిన వాళ్ళకే లభ్యమవుతారట! వాళ్ళు తపస్సులు కూడా చేస్తూ వుంటారట! ఏమిటేమిటో చెప్తుంది బామ్మ!

ఏమో, వాళ్ళ సంగతేమో గాని, తనకి మాత్రం కాముడు బావ ఎంత తపస్సు చేస్తే లభించాడు! ఎంత అందగాడో అంత మాటకారి! ఎంత ఎత్తయినవాడో అంత బలమైనవాడు! ఎంత ఆస్తి వున్నవాడో అంత పెద్ద ఉద్యోగం వున్నవాడు! వాళ్ళ బాస్ లక్ష రూపాయల కట్నంతో తన ఏకైక అందాల ఎమ్మే కూతుర్ని ఇస్తానన్నా కాదని, “మేనమామ కూతురుంది” అంటూ నయాపైసా కట్నం కోరకుండా తనని చేసుకున్నాడంటే అంతా బామ్మ చలవేగా!

ఊరు ఊరంతా హడలిపోయే గురువులు గాణ్ణి హడలెత్తించిన నరసింహం మామయ్యకి, బామ్మంటే హడల్ అంటే, బామ్మ ఎంతటిది! ఎంతటి దర్జా గలది! బామ్మ మాటంటే బావకి వేదం! మరి వేదవతత్తయ్య బావకి అమ్మే గదా! అంటే బామ్మకి కూతురే గదా!



బామ్మకి అత్తయ్య మీదకన్న తన మీద ఎక్కువ ప్రేమ! అందుకే అత్తయ్యకి కూడా ఎప్పుడూ కొననంత ఖరీదైన, అరుదైన చీరకొంది తన కోసం, అబ్బ! ఎంత బావుంటుందో ఆ చీర!!

ఏమిటీ పూట తన మనసు బావ మీదకన్నా, బామ్మ ఇచ్చిన చీర మీదే వుంది? అవును మరి! బావని జన్మజన్మాలకి తనవాణ్ణిగా చేసే అందాల చీర కదా అది, ఓహ్! ఆ చీర అందం చూసి తీరాల్సిందే!

ప్రొద్దున్నే గబగబా తను ప్యాకెట్ విప్పబోతుంటే, బామ్మ ముసి ముసి నవ్వులు నవ్వుతూ, "ఇప్పుడు కాదే భడవా! రాత్రికి గదిలో కెళ్ళిన తరువాత ఇస్తా! అప్పుడు మీ మామయ్య పెట్టిన చీర విప్పి ఇది కట్టుకో! ఈ చీర కట్టావా, ఇక నీబావ ఈ జన్మకి కాదు గదా, జన్మజన్మాలకి నిన్ను వదిలిపెట్టడు. నిన్ను కాదని ఎవత్తి వెంటా పడడు" అంది. అబ్బ ఛీ! అప్పుడు అక్కడే వున్న తన నచ్చిన బావ, పద్మనయనంబుల బావ, నవ్వు రాజిల్లెడి మోముతో, తన మాన ధనం అక్కడికక్కడ దోచేట్టు చూస్తుంటే తన కెంత సిగ్గేసింది.

ఇప్పుడు కూడా బామ్మ అందర్నీ గసురుకుని, గెంటేసి, "ఇదిగోనే పిల్లా నీచీర! ఇహ ఆ చీర విప్పేసి ఇది కట్టుకో, ఈ రాత్రే కాదు, ఇక్కడి నుంచి నీ బావ ప్రక్కనున్న ప్రతిరాత్రి ఈ చీరే కట్టుకో, నీ బావ నీకత్తుకుపోతాడు. వదలడు జాగ్రత్త"! అంటూ భళ్ళున తలుపేసి వెళ్ళిపోయింది.

అలాగే ఆలోచిస్తూ కూర్చున్న కామేశ్వరిని చెయ్యి పట్టుకుని ప్యాకెట్ విప్పించాడు బావ. కామేశ్వరి ఒళ్ళు ఝల్లుమంది! ప్యాకెట్‌లో ప్యాకెట్! ఇద్దరూ కలిసి దాన్ని విప్పారు. అందులో ఇంకోటి ! ఓపిగ్గా అదీ విప్పారు. లోపల ఒక చిన్న బంగారు పువ్వున్న వెండిపెట్టె! ఆత్రంగా అదీ తెరిచారు. కళ్ళు జిగేల్‌మంటున్నాయి ఇద్దరికీ! కళ్ళు చికిలించి మళ్ళీ చూశారు. పెట్టెలో ఆరు గజాల చీర కాదు గదా, అరంగుళం నూలు పోగుకూడా లేదు.

తెల్లబోయింది. కామేశ్వరి తెల్లవార్లూ నవ్వుతూనే వున్నాడు కాముడు బావ. తెల్లవారినా కూడా కవ్విస్తూనే వుంది.

రజత నగ్న పేటిక!!